క్లుప్తంగా

ఆర్థిక సాయం

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లెలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమైన ఓ పేద యువకుడి కుటుంబానికి ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి అండగా నిలిచారు. మండలంలోని జీఎంఆర్ కాలనీకి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ జాలా విజయ్ కుమార్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ సుదర్శన్ రెడ్డి తన సోదరుడు మద్దిరేవుల సురేంద్రనాథ్ రెడ్డితో కలిసి వైద్య ఖర్చుల కోసం రూ. 50 వేలు ఆర్థిక సాయాన్ని బాధితుని కుటుంబ సభ్యులకు అందించి అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఎంపీపీకి విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

యథేచ్ఛగా ప్రభుత్వ భూమి ఆక్రమణ


ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

పుల్లంపేట : మండల పరిధిలోని కేతరాజుపల్లిలోని సర్వే నెంబరు 222లో 15 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణదారులు యథేచ్ఛగా రెండు జేసీబీలతో చదును చేశారు. గతంలో ఈ భూమిని పేదలకు పంచాలని రెవెన్యూ అధికారులు అసైన్‌మెంట్ కమిటీకి పంపారు. అయితే అసైన్‌మెంట్ భూ పంపిణీలో అంతరాయం రావడంతో రోడ్డు పక్కనే ఉన్న ప్రభుత్వభూమిపై ఆక్రమణదారుల కన్నుపడింది. భూమిని ఆక్రమించడమే కాక చదును పనులు చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణదారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయంపై తహసీల్దార్ వెంకటనారాయణను వివరణ కోరగా తమ దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

చిట్వేలి : శివారెడ్డి మృతి పార్టీకి తీరనిలోటని రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మైనలపల్లికి చెందిన ముద్దా శివారెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం ఉదయం మృతి చెందగా ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శివారెడ్డి పార్టీకి ఎనలేని సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, ఏపీ టూరిజం డైరెక్టర్ సాయికిషోర్ రెడ్డి, ఎంపీపీ చంద్ర, ఉమామహేశ్వర రెడ్డి, మలిశెట్టి వెంకటరమణ, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం నుంచి తరగతుల నిర్వహణ

రామాపురం : మండలంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం నుంచి 10వ తరగతి పరీక్షలను నిర్వహిస్తుండడంతో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్నం నుంచి ఆదర్శ పాఠశాలలో తరగతులు నిర్వహించనున్నట్లు ఎంఈఓ రామకృష్ణుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని ఆయన సూచించారు.

టీడీపీలో ఐవీఆర్ఎస్ రగడ

బి.కొత్తకోట: తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ పేరుతో శనివారం టీడీపీ నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేపై టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి వర్గీయులు భగ్గుమంటున్నారు. 2014 ఎన్నికల్లో మీ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా మీరు ఎవరిని కోరుకుంటున్నారు అని చంద్రబాబు వాయిస్‌తో, తర్వాత శంకర్‌యాదవ్ అయితే ఒకటి నొక్కండి, నోటా అయితే రెండు నొక్కండి అని ఫోన్లకు వాయిస్ కాల్స్ వచ్చాయి. దీనితో తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీలో రగడ నెలకొంది. ఇప్పటికే జయచంద్రారెడ్డికి అభ్యర్థిత్వం ఖరారైందని, మళ్లీ అభ్యర్థి ఎంపిక ఉండదని ఆయన వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది నకిలీ ఐవీఆర్ఎస్ అని, నిజం కాదని చెబుతూ వాట్సప్ గ్రూపుల్లో మెసేజ్‌లు ఫార్వార్డ్ చేసుకుంటున్నారు. శంకర్ పేరుతో వచ్చిన సర్వే నకిలీ అయితే జయచంద్రరెడ్డి పేరుతో వచ్చిన ఐవీఆర్ఎస్ సర్వే కూడా నకిలీ నేనా అని శంకర్ వర్గీయులు వాదిస్తున్నారు. దీనిపై ఆదివారం శంకర్ వర్గీయులు బి.కొత్తకోటలోని పార్టీ కార్యాలయంలో సమావేశమై టికెట్ శంకర్‌కే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సర్వే వివాదంతో టీడీపీలో రగడ జరుగుతోంది.

పర్యావరణంపై అవగాహన ర్యాలీ

వైవీయూ : పెండ్లిమర్రి మండలం మిట్టమీదపల్లెలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఆదివారం పర్యావరణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైవీయూ జాతీయ సేవా పథకం యూనిట్-4 ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డా.సునీత మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువుల వినియోగం ద్వారా జరిగే పరిణామాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో పరిసరాలను శుభ్రం చేశారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్
- 30 నిమిషాల ముందే కేంద్రాలకు చేరుకోవాలంటున్న అధికారులు


సంబేపల్లెలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం


రాజంపేట టౌన్: బల్లలపై హాల్‌టికెట్ నెంబర్లు వేస్తున్న సిబ్బంది

రాజంపేట టౌన్ : ప్రతి విద్యార్థి జీవితానికి పదవ తరగతి ఓ మలుపులాంటిది. పది పబ్లిక్ పరీక్షలతో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తొలి అడుగుపడుతుంది. అందువల్ల విద్యార్థులు రాత్రింబవళ్లు పుస్తకాలే నేస్తాలై పరీక్షలకు సన్నద్ధమయ్యారు. విద్యార్థుల ఆశలకే కాక తల్లిదండ్రుల ఆకాంక్షలకు పునాదిరాయి పడే సమయం వచ్చింది. కోటి ఆశలతో విద్యార్థులు సోమవారం నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షల కోసం రాజంపేటలో మొత్తం తొమ్మిది కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో పట్టణంలో ఏడు పరీక్షా కేంద్రాలు, గ్రామీణ ప్రాంతంలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే పట్టణంలోని జెడ్పీ మన్నూరు హైస్కూల్, ఇన్‌ఫాంట్ జీసెస్ హైస్కూల్, జెడ్పీ ఉర్దూ హైస్కూల్‌లలో ఒకొక్క కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రూరల్ పరిధిలో బోయినపల్లెలోని జెడ్పీ హైస్కూల్, ఊటుకూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1608 మంది విద్యార్థులు పది పబ్లిక్ పరీక్షలను రాయనున్నారు. 83 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. కాగా సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానుండటంతో పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపట్టారు. ప్రతి విద్యార్థి బల్లపైనే కూర్చొని పరీక్ష రాసేందుకు బల్లలను ఏర్పాటు చేశారు. ప్రతి గది వద్ద నీటి సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పరీక్షలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చీఫ్ ఎగ్జామ్ సూపరింటెండెంట్ రెడ్డయ్య రెడ్డి, డిపార్టుమెంటల్ ఆఫీసర్ ఓబుల్ రెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 150 మంది పరీక్షలకు హాజరవుతారని, వీరికి పరీక్షల నిర్వహణ సామగ్రితోపాటు డెస్కులు, ఫ్యాన్‌లు, లైట్‌లు, తాగునీరు, టాయిలెట్‌లు వంటి కనీస సౌకర్యాలను పూర్తిస్థాయిలో కల్పించామన్నారు. పరీక్షల నిర్వహణ సమయంలో ఆరోగ్య సిబ్బంది సైతం అందుబాటులో ఉంటారని చెప్పారు. పోలీసుల పర్యవేక్షణలో పరీక్షల కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థి నుంచి అధికారి వరకు ఎవరికీ సెల్‌ఫోన్ అనుమతి లేదన్నారు. విద్యార్థులు ఎవరు ఎలక్ట్రానిక్ పరికరాలు, పుస్తకాలు, చిట్టీలు పరీక్షా కేంద్రాల వద్దకు తీసుకు రావద్దని సూచించారు. పరీక్షలు ప్రశాంతంగా, కట్టుదిట్టంగా నిర్వహణకు అందరూ సహకరించాలని తెలియజేశారు.

రామాపురంలో..

రామాపురం : మండలంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం నుంచి 10వ తరగతి పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ రామకృష్ణుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి సుమారు 384 మంది విద్యార్థులు ఆదర్శ పాఠశాల పరీక్షా కేంద్రంలో పరీక్షలకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్షా సమయం కన్నా 30 నిమిషాలు ముందు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. చీఫ్‌గా చంద్రశేఖర్, బషీర్ అహమ్మద్, డిపార్ట్‌మెంట్ అధికారి రమణారెడ్డి, నారాయణల ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ప్రకటనలో తెలియజేశారు.

ముందుగానే పరీక్షా కేంద్రాలకు..



టెన్త్ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులు పరీక్ష ప్రారంభ సమయాని కంటే అరగంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకునేలా ప్రణాళిక రూపొందించుకోవాలి. ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకుంటే మనసును ప్రశాంతంగా ఉంచుకోవచ్చు.

– కొండూరు రఘునాథరాజు, ఎంఈఓ, రాజంపేట

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్



పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్షా కేంద్రాల వద్ద ఉండటానికి ఎవరికి అనుమతులు లేవు. తల్లిదండ్రులు తమ పిల్లలను పరీక్షా కేంద్రాల వద్ద వదలి వెంటనే వెళ్లిపోవాలి. పరీక్షలు జరిగే సమయంలో ఫోటోస్టాట్ సెంటర్‌లను మూసివేయాలి.

– మద్దయ్యఆచారి, అర్బన్ సీఐ, రాజంపేట

నాటుసారా స్వాధీనం

ఓబులవారిపల్లె : మండలంలోని యల్లాయపల్లె గ్రామం సమీపంలో ఆదివారం నాటుసారాను స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య విలేకరులకు తెలిపారు. పక్కా సమాచారంతో సిబ్బందితో కలిసి గ్రామం సమీపంలో అనుమానస్పదంగా ఉన్న వ్యక్తులను పరిశీలించగా వారి వద్ద నుంచి 11 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలియజేశారు.

విచ్చలవిడిగా కర్ణాటక మద్యం అమ్మకాలు

పెద్దతిప్పసముద్రం : మండలానికి కూతవేటు దూరంలోనే కర్ణాటక సరిహద్దు ఉంది. దీంతో మండలంలో ఎక్కడ చూసినా కర్ణాటక మద్యం ఏరులై పారుతుండటంతో విక్రయాలు కూడా అదే తరహాలో ఊపందుకుంటున్నాయి. మండలంలో చెక్‌పోస్టులు ఉన్నా మద్యం అక్రమ రవాణా ఆగడంలేదు. కొందరు చెక్‌పోస్టుల మీదుగా కాకుండా దొడ్డిదారుల్లో సంచుల్లో నింపుకుని కాలినడకన దిగుమతి చేస్తున్నారు. మరికొందరు ఎన్నికల సమయం ముంచుకొస్తున్న తరుణంలో మద్యంకు గిరాకీ ఉంటుందని మద్యాన్ని నిల్వ చేసుకుంటున్నారు. కార్లలో మద్యం రవాణా చేసే బడా వ్యాపారస్తులకు ఎస్ఈబీలో పని చేసే పలువురు ఖాకీల అండదండలు పుష్కలంగా ఉండటంతోనే అక్రమ వ్యాపారం దర్జాగా సాగుతోందని ప్రజల్లో విమర్శలు వస్తున్నాయి. బడా వ్యాపారులను చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ప్రజల్లో గుప్పుమంటున్నాయి. సివిల్ పోలీసులైతే నెలకు పదుల్లోనే లిక్కర్ కేసులు నమోదు చేస్తున్నా ఎస్ఈబీ అధికారులు ఇంతకు మించి లిక్కర్ కేసులు ఎందుకు నమోదు చేయలేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఎస్ఈబీ అధికారులు మద్యం అక్రమ రవాణా, నిల్వలపై నిఘా వేసి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కష్టపడి పని చేసేవారికి పార్టీలో గుర్తింపు


గౌస్‌బాషాను సత్కరిస్తున్న పోలా శ్రీనివాస్‌రెడ్డి

రాజంపేట టౌన్ : పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి వైఎస్సార్‌సీపీలో పదవులు వెతుక్కుంటూ వస్తాయని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రాజంపేట పట్టణానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకుడు సయ్యద్ గౌస్‌బాషాకు పార్టీ అధిష్టానం మైనార్టీ విభాగం జిల్లా జాయింట్ సెక్రటరీగా నియమించడంతో ఆదివారం రాత్రి మున్సిపల్ ఛైర్మన్ ఆయన్ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పోలా మాట్లాడుతూ గౌస్‌బాషా మండల కో–ఆప్షన్ మెంబర్‌గా కూడా ఉన్నారని, పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తుండటం వల్లే ఆయనను వైఎస్సార్‌సీపీ అధిష్టానం ప్రత్యేకంగా గుర్తించి పార్టీలో సముచిత స్థానం కల్పించిందన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు మరో యాభై ఐదు రోజులు పార్టీ కోసం కష్టపడి పనిచేసి ఎంపీగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా ఆకేపాటి అమర్‌నాథరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి జగన్‌కు బహుమతిగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, డీలర్ సుబ్బరామిరెడ్డి, ఎస్.ముజఫర్ అహమ్మద్, పఠాన్ ఖాజామోహిద్దీన్, జుబేర్, నూర్‌బాషా, హబీబ్, ఆర్ఎస్.చాన్, అబ్దుల్ మునాఫ్, న్యామతుల్లా, కరీం, మోహిన్‌ఖాన్, మౌలానా, షేక్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విభాగాల్లో పలువురి నియామకం


మధుసూదన్‌రెడ్డి

గాలివీడు : వైఎస్ఆర్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ వాణిజ్య విభాగం జిల్లా కమిటీని అధిష్టానం నియమించింది. ఇందులో అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీగా గాలివీడు మండలం గోరాన్‌చెరువు గ్రామానికి చెందిన యువ నాయకుడు దాసరి మధుసూదన్‌రెడ్డిని ప్రకటించారు. వైఎస్ కుటుంబానికి విధేయుడిగా ఉంటూ వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేశారు. నియామకంపై మాట్లాడిన ఆయన తన ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

రైతు విభాగం కార్యదర్శిగా సుబ్బరామిరెడ్డి


పల్లె సుబ్బరామిరెడ్డి

సిద్దవటం : వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా రైతు విభాగం కార్యదర్శిగా పల్లె సుబ్బరామిరెడ్డిని పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. ఈ సందర్భంగా పల్లె సుబ్బరామిరెడ్డి ఆదివారం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తనను అన్నమయ్య జిల్లా రైతు విభాగం కమిటీలో కార్యదర్శిగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందన్నారు.

మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా జావిద్


జావిద్‌అలీ

రాజంపేట : జిల్లా మైనార్టీ సెల్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజంపేటకు చెందిన షేక్ మహమ్మద్ జావిద్ అలీ నియమితులయ్యారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలను తెలియజేశారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన కోళ్లబైలు టీడీపీ యూత్

మదనపల్లె : మండలంలోని కోళ్లబైలు పంచాయతీకి చెందిన టీడీపీ యూత్ ఆదివారం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. సొసైటీకాలనీలోని పార్టీ కార్యాలయంలో నిసార్‌అహ్మద్ యువకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధికి ఆకర్షితులై యువత పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి నాయకత్వంలో, జగనన్నతో నడవాలని నిర్ణయించుకుని యువత నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల నియామవళి అమలు

ఆర్‌డీఓ టి.మోహనరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మోహన్‌రావు


సమావేశానికి హాజరైన అధికారులు, పోలీసులు

రాజంపేట : ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ టి.మోహనరావు ఆదేశించారు. ఆదివారం సబ్ కలెక్టరేట్‌లోని అన్నమయ్య సభా భవనంలో వివిధ స్థాయి ఎన్నికల అధికారులు, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటిఫికేషన్ విడుదలైన 24 గంటలలో రాజకీయ పార్టీలకు సంబంధించిన ఎలాంటి ప్రచార హోర్డింగులు, సంక్షేమ పథకాల ప్రకటనలను తొలిగించాల్సి ఉంటుందన్నారు. 48 గంటలలోపు ప్రభుత్వానికి సంబంధించిన ఆస్తులపై పార్టీలకు సంబంధించిన ప్రకటనలు, పబ్లిసిటీ బోర్డులు తీసేయాలన్నారు. ప్రైవేటు ఆస్తుల వద్ద ప్రదర్శించిన అనధికార రాజకీయ ప్రకటనలు 72 గంటలలోపు తొలిగించబడతాయన్నారు. అధికారిక మాస్ మీడియాను తమ రాజకీయ ప్రకటనల కోసం దుర్వినియోగం చేయడాన్ని నేరంగా పరిగణిస్తారన్నారు. అభివృద్ధి, నిర్మాణ ప్రాజెక్టులలో సంబంధం ఉన్న ప్రభుత్వ విభాగాలు వాటి పరిధిలో ఇప్పటికే ప్రారంభింపబడిన పనులు జాబితా, ప్రారంభించిన పనులను జాబితాను ఎన్నికల ప్రకటన వెలువడిన 72 గంటల లోపల ఎన్నికల సంఘానికి తెలియజేయాలన్నారు. మద్యం, నగదు, నిషేధిత డ్రగ్స్, అక్రమర వాణాను తనిఖీ చేయడానికి ఎక్సైజ్ అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఎన్నికల ప్రకటన వెలువడిన తక్షణమే సంసిద్ధం చేయడం జరిగిందన్నారు. ఫిర్యాదుల పరిష్కారం కోసం 1950లో కాల్ చేయాలన్నారు. ఫిర్యాదు అందిన 24 గంటలలోపు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల అధికారులు సమన్వయంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయవలసినదిగా కోరారు. నియోజకవర్గంలోని రాజంపేట, నందలూరు, సిద్దవటం, ఒంటిమిట్ట, వీరబల్లి, సుండుపల్లె మండలాల్లో ఎన్నికల నియామవళిని స్థానిక అధికారులు తక్షణమే అమలు చేస్తున్నారన్నారు. అనంతరం డీఎస్పీ చైతన్య, మున్సిపాలిటీ కమిషనరు రాంబాబు, తహసీల్దారు ఇన్బనాథన్‌లతో కలిసి రైల్వే స్టేషన్, బస్‌స్టేషన్, మండల పరిషత్ కార్యాలయం తదితర ప్రాంతాలను సందర్శించారు.

కష్టంతో కాదు ఇష్టంతో చదవాలి

కడప ఎడ్యుకేషన్ : చదువును కష్టంతో కాకుండా ఇష్టంతో చదివినప్పుడే సులభంగా రాణించవచ్చని వైవీయూ పాలకమండలి సభ్యులు మూల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. కడప మోచంపేట సిద్దార్థ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో పది విద్యార్థులకు వీడ్కోలు సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తుకు తొలిమెట్టు అన్నారు. కష్టపడి చదివి అటు పాఠశాలలోపాటు వారి తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ లక్ష్మయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిల్పారామంలో సందడి

కడప కల్చరల్ : ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా చిన్నారులు తమ నృత్యాలతో అలరించారు. స్థానిక విజిల్స్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కడప శిల్పారామంలో జరిగిన కార్యక్రమంలో సినిమా పాటలు, జానపద నృత్యాలతో ఆకట్టుకున్నారు. సందర్శకులు అడుగడుగునా ప్రోత్సహిస్తూ కరతాళ ధ్వనులు చేశారు. శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

జగనన్నను మరోమారు గెలిపించుకుందాం

ఫ్యాన్ గుర్తుకే తమ ఓటంటూ నాయకలకు తెలియజేస్తున్న ఓటర్లు


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నాయకులు

గాలివీడు : శాసనసభ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, వేయించి ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీకాంత్‌రెడ్డిలను అత్యధిక మెజా ర్టీతో గెలిపించి మరోమారు జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుందామని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గడికోట సుధీర్‌రెడ్డి ఓటర్లను కోరారు. ఆదివారం మండలంలో బోరెడ్డిగారిపల్లెలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి సుధీర్ రెడ్డి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాయన్నారు. సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రతి ఇంటా ప్రజలు చిరునవ్వుతో పలకరిస్తూ తమ ఓటు ఫ్యాన్ గుర్తుకేనని తెలియజేయడం చాలా సంతోషంగా ఉందని ఆయన చెప్పారు. ఈ ఎన్నికలు పేదలకు, పెత్తందారుల మధ్యనే జరుగుతోందని, ప్రతి ఓటరు గమనించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తిరిగి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యదుభూషణ్‌రెడ్డి, సర్పంచ్ ఉమాపతిరెడ్డి, చెన్నకేశవరెడ్డి, నారాయణ, ఎంపీటీసీలు చంద్రప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మా అమర్‌నాథరెడ్డి, బీసీ నాయకులు నారాయణ, మాజీ సర్పంచ్ వెంకటనారాయణరెడ్డి, ఉప సర్పంచ్ మన్సూర్, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయానికి భక్తుల తాకిడి


ప్రత్యేక అలంకారంలో గంగమ్మ

లక్కిరెడ్డిపల్లె : భక్తులు వేలాదిగా తరలిరావడంతో ఆదివారం గంగమ్మ దేవత ఆలయ ప్రాంగణం జాతరను తలపించింది. మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. గంగమ్మతల్లి సేవా సమితి ఆధ్వర్యంలో తెల్లవారుజామున గంగమ్మ ఆలయంలోని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యాన్ని పూజారులు కల్పించారు. లక్కిరెడ్డిపల్లె సీఐ జీవన్ గంగనాథ్ బాబు, ఎస్ఐ విష్ణువర్ధన్‌లు తన సిబ్బందితో కలిసి ఆలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ రెడ్డయ్య, ప్రత్యేక అధికారి రవీంధర్ రాజు, సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు సమరసింహారెడ్డి, ఉప సర్పంచ్ రాజబాబులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. చెల్లు వంశీయులైన పూజారులు రవి, గంగాధర్, శ్రీనివాసులు, మునీంద్రలు భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పింపచేసి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పదవి ఉన్నా లేకున్నా.. అందుబాటులో ఉన్నా

- మీతో అనుబంధం తుదిశ్వాస వరకు..
- ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి


సమావేశంలో మాట్లాడుతున్న ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట టౌన్ : పదవులున్నా లేకున్నా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే తనను వచ్చే ఎన్నికల్లో ఆదరించి గెలిపించాలని జెడ్పీ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి కౌన్సిలర్ సనిశెట్టి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి అమర్‌నాథరెడ్డి ఆర్యవైశ్యులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ దాదాపు నాలుగు దశాబ్దాలుగా తనకు ఆర్యవైశ్యులతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. ఈ అనుబంధం తన తుదిశ్వాస వరకు ఇలాగే కొనసాగుతుందని చెప్పారు. ఇటీవల దుస్తుల వ్యాపారులకు కొన్ని ఇబ్బందులు వచ్చిన విషయం తన దృష్టికి రాగానే అధికారులతో మాట్లాడి పరిష్కరించానన్నారు. ఆర్యవైశ్యుల సౌకర్యార్థం గత ఏడాది దశరా సందర్భంగా జమ్మిజెట్టు వద్ద జెడ్పీ నిధులతో బోరు వేయించినట్లు గుర్తుచేశారు. ఆర్యవైశ్యులకు ఏ సమస్య వచ్చినా, ఎలాంటి సహకారం అవసరమైనా తనకు పదవి ఉన్నా లేకున్నా తనవంతు చేయూత అందిస్తున్నట్లు తెలియజేశారు. పట్టణంలో ఎనబై శాతానికి పైగా ఆర్యవైశ్యులు వ్యాపారాల పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. జగన్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల వల్ల పేద, మధ్య తరగతి ప్రజలకు కొనుగోలు శక్తి పెరిగిందని, ఇది ఆర్యవైశ్యుల వ్యాపారాభివృద్ధికి దోహదపడిందన్నారు. అందువల్ల ఆర్యవైశ్యులు వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి తమ సంపూర్ణ మద్దతు ఇచ్చి జగన్‌ను మళ్లీ సీఎం చేయాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ సీఎంగా ఉంటేనే వ్యాపారులు ఆర్థికాభివృద్ధి సాధించగలన్నారు. ప్రస్తుతం జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో మూడు అసెంబ్లీ స్థానాల్లో ఆర్యవైశ్యులకు సీట్లు ఇచ్చారన్నారు. అంతేకాక గత కేబినెట్‌లో వెల్లంపల్లి శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇచ్చి ఆర్యవైశ్యుల పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకున్నారని పేర్కొన్నారు. ఆర్యవైశ్యులను ఎంతగానో అభిమానించే జగన్‌కు మీరంతా అండగా నిలవాలని కోరారు. అంతకుముందు ఆకేపాటి భవన్‌లో టూవీలర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ఆకేపాటి ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డి, చొప్పా ఎల్లారెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గ్రంథే సత్యనారాయణ గుప్తా, గునిశెట్టి రమేష్, మాజీ అధ్యక్షుడు ఏల్చూరు అశోక్ కుమార్, రాష్ట్ర ఔట్‌సోర్స్ ఎంప్లాయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రశాంతి, క్లాత్ మర్చంట్, రెడిమేడ్, కిరాణా మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు సుదర్శన్ గుప్తా, పచ్చిపులుసు కిషోర్, ఎలకంటి గోపి, వివిధ వ్యాపారాల అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాసులు, అవినాష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యం


నందలూరు మండల కేంద్రంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నందలూరు(రాజంపేట) : స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా నిర్ణయించుకున్నామని ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ అన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచకొని ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు తామున్నామని భరోసా ఇస్తూ మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీలోని అరవపల్లె, ఆర్ఎస్ రోడ్డు, తోటపాలెం, గాంధీ నగర్, నందలూరు పంచాయతీలో ఎస్ఎస్‌బీ డీఎస్పీ రామ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసులతో ఆదివారం కవాతు నిర్వహించి ప్రజలతో మమేకం అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కృష్ణారావు, డీఎస్పీ వీఎన్‌కే చైతన్య, మన్నూరు సీఐ మంజునాథరెడ్డి ఆదేశాల మేరకు ఎన్నికల్లో ఎలాంటి భయాందోళనకు గురికాకుండా ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక బలగాలు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.